## వృద్ధాప్యంలో కన్నతండ్రిని వేధిస్తున్న కొడుకులు

❖ *కేసు నమోదు చేసిన చిన్నకోడూరు పోలీసులు..*



**దశ, సిద్దిపేట్:** ఆస్తి రాసిచ్చిన తర్వాత కన్నతండ్రిని, తల్లిని పట్టించుకోకుండా, కనీసం తిండి పెట్టకుండా వేధిస్తున్న ఇద్దరు కొడుకులపై చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి గంగాపూర్ గ్రామానికి చెందిన కొండి నారాయణరెడ్డి (94)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి సిద్దిపేటలో వ్యాపారం చేస్తుండగా, చిన్న కుమారుడు పరమేశ్వర్ రెడ్డి గంగాపూర్‌లోనే వ్యవసాయం చేస్తున్నాడు. నారాయణరెడ్డి తనకున్న 7 ఎకరాల భూమిని ఇద్దరు కొడుకులకు సమానంగా (చెరి 3 ½ ఎకరాలు) రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. వయస్సు పైబడటంతో తమను చూసుకుంటారని ఆస్తిని అప్పగించగా, కొడుకులు మాట మార్చారు. తమను ఒక పాత ఇంట్లో ఉంచి, కనీస సౌకర్యాలు కల్పించకుండా, సరిగ్గా తిండి కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎదురుతిరిగి ప్రశ్నిస్తే బూతు మాటలతో తిడుతూ, చంపుతామని బెదిరిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్ మానవత్వంతో స్పందించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు రాలేని స్థితిలో ఉన్నందున, అధికారులే నేరుగా నారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఫిర్యాదును స్వీకరించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులను వేధించడం చట్టరీత్యా నేరమని, బాధ్యులైన ఇద్దరు కొడుకులపై కేసు నమోదు చేయడం జరిగిందని , చట్టరీత్య తగిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీను ఈ సందర్భంగా తెలిపారు.

## చెత్త సేకరణలో మున్సిపాలిటీకి సహకరించండి

❖ *రోడ్లపై చెత్త వేయవద్దు - ఖాళీ స్థలాలలను శుభ్రంగా వుంచవలసిన భాధ్యత యజమానులదే.*

❖ *33 వ వార్డులో ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది.*



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** చెత్త సేకరణలో మున్సిపాలిటీకి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శనివారం ఉదయం స్థానిక 33 వ వార్డులోని గణేష్ చౌరస్తాలో జరిగిన ప్రజా పాలన పట్టణ ప్రణాళక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగుల వాసు తో కలిసి వార్డులో పర్యటించారు. వార్డులో డ్రైనేజీలు శుభ్రం చేయాలని ప్రజల నుంచి ప్రతి రోజు చెత్త సేకరణ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజలు తమ వీధిలోనికి వచ్చే మున్సిపల్ వాహనానికి ప్రతిరోజు కూడా చెత్తను వేరుచేసి అందించాలని, చెత్తను రోడ్లపై వేయవద్దని అన్నారు. దోమల నివారణకు ప్రతి వార్డులో కూడా ఫాగింగ్ చేయడం జరుగుతుందని, ఏ వార్డులోనైన ఫాగింగ్ జరగకపోతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఖాళి స్థలాల్లో కంప చెట్లు పెరగకుండా యజమానులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఖాళి స్థలాలలో చెత్తాచెదారంలో వేయవద్దని అన్నారు. ఖాళీ స్థలాలకు పెన్సింగ్ వేయించుకోవాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది

❖ *మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తా..-తీన్మార్ మల్లన్న*

❖ *ఇఫ్తార్ విందులో పాల్గొన్న టిఆర్పి అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న*



**దశ, సిద్దిపేట్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగపూర్ మజీద్ లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్దిపేట జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ బాబా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టిఆర్పి పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గజ్వేల్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, రంజాన్ మాసం పవిత్రమాసమని, మైనారిటీ సోదరులందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ పాటుపడుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మైనార్టీల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.పార్టీకోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 119 ఎమ్మెల్యేలలో నియోజకవర్గంలో ఉంటూ, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండని ఏకైక ఎమ్మెల్యే కేసీఆర్ అని, గజ్వేల్ లో బిఆర్ఎస్ పార్టీని ఖతం చేస్తామని వాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పండల్, టిఆర్పి పార్టీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు తుప్పతి శ్వేతా, టిఆర్ పి పార్టీ మర్కుక్ మండల అధ్యక్షుడు ఆకుల అనిల్ కుమార్, సంపత్, గడ్డం వెంకటేష్, టిఆర్పి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పిఏ అరెస్ట్

❖ *దళిత యువతిని మోసం చేసిన కేసులో అరెస్టు*

❖ *పెళ్లి చేస్తానని నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణ*

❖ *ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదు*

**దశ, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనంగా మారిన ఘటనలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిఏ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఏ శ్రీనివాస్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. బాధితురాలు దళిత యువతి కావడంతో పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం పిఏ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. దీంతో ఆయనను జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందుకు



**దశ, ఓయూ :** నాచారంలోని హజ్రత్ బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, రంజన్ మాసం సందర్భంగా మాజీ సైనికుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మామిడాల సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. పేద ముస్లింలకు తోఫా లను అందించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మైనారిటీల కోసమే కట్టుబడి పని చేస్తున్న పార్టీగా చెప్పారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీపాద రావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మొక్కలను నాటడం, రక్తదాన కార్యక్రమం, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టం తో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

❖ *శ్రీ సాయి త్రివేణి డిగ్రీ&పిజీ కళాశాల కరస్పాండెంట్ పెసర జనార్దన్ రెడ్డి.*

❖ *ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు*




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** విద్యార్థులు ఇష్టం తో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని శ్రీసాయి త్రివేణి డిగ్రీ&పిజీ కళాశాల కరస్పాండెంట్ పెసర జనార్దన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ లో శనివారం శ్రీసాయి త్రివేణి డిగ్రీ,పిజి కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫేర్వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య తో ఏ రంగంలోనైనా రాణించవచ్చుని ఆ దిశగా ప్రణాళిక రూపొందించుకొని తల్లి తండ్రులకు, కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థిని, విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా లక్ష్యాన్ని ఎంచుకోని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. గత 32 సంవత్సరాలుగా సూర్యాపేట పట్టణంలో విద్యారంగంలో సేవలు అందిస్తున్న సంస్థ అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ దిర్శనపు అనీల్ కుమార్, ప్రిన్సిపాల్ తన్నీరు ఉపేందర్, అధ్యాపకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి, జక్కిరెడ్డి వెంకట్ రెడ్డి, గంజికుంట్ల గోపీనాథ్, ఉయ్యాల నరసయ్య గౌడ్, బెజవాడ నాగేశ్వరరావు, కట్టంగూరి వెంకట్ గౌడ్, మండల్ రెడ్డి మల్లారెడ్డి, రేగట్టె మల్సూర్, రమేష్, ఆవుల అంజయ్య యాదవ్, రవళి, అధ్యాపకేతర సిబ్బంది కోడి లింగయ్య, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## కూసం రాజమౌళి కాంస్య విగ్రహ ఏర్పాటుకు అఖిలపక్ష కమిటీ

**దశ, పరకాల:** దేశం గర్వించేలాగా గంగాదేవిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన జాతీయ ఆదర్శ గ్రామ మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి స్మారకార్థం గ్రామంలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గీసుగొండ మండలం గంగాదేవిపల్లి గ్రామంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా కూసం రమేష్‌ను ఎంపిక చేయగా, సభ్యులుగా గోనె కుమారస్వామి, సోమిరెడ్డి శీను, ఆకుల రుద్ర ప్రసాద్, గోనె మలయ్య, గోనె నాగరాజు, కూసం లింగయ్య, చల్ల మల్లయ్య, గోనె రాజయ్య, గడ్డమీద బాలరాజు, ముస్కు రమేష్, చల్ల లింగం, గోపాల్ రాజు, కూసం మల్లిఖార్జున్, గోని సంపత్‌లను నియమించారు. ఈ సందర్భంగా గోనె కుమారస్వామి మాట్లాడుతూ కూసం రాజమౌళి గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి గంగాదేవిపల్లి గ్రామాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. ఆయన చేసిన సేవలు గ్రామ ప్రజలకు మరువలేనివని పేర్కొన్నారు. ఆయన సేవలకు గుర్తుగా



గ్రామంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించిందన్నారు. అలాగే కూసం రాజమౌళి సంతాప సభను ఈ నెల 18032026న గంగాదేవిపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మండల ప్రజానీకం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై ఆయన ఆత్మకు శాంతి చేకూరేలా నివాళులు అర్పించాలని కోరారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని బిఆర్ఎస్ పార్టీ ఏడవ వార్డు కౌన్సిలర్ ఈద ప్రవీణ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రం ఏడో వార్డు లో మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశాల మేరకు ముస్లింలకు స్థానిక కౌన్సిలర్ ఈద ప్రవీణ్ ఆధ్వర్యంలో సహాబా మసీద్ లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసమన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు సూర్యాస్తమయం తర్వాత ఉపవాసాన్ని రోజా విరమించే సాయంత్రపు భోజనాన్ని ఇఫ్తార్ విందు అంటారని, ఇది ఖర్జూరాలు, నీరు లేదా పండ్లతో మొదలై సాంప్రదాయ వంటకాలతో కూడిన రుచికరమైన విందుగా మారుతుందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు సమాజంతో కలిసి భోజనం చేయడం, పరస్పర స్నేహభావం, ఐక్యతను పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌల్ సాబ్ మౌలానా అక్రం, కాంట్రాక్టర్ జలీల్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు గౌస్, ధైద కృష్ణ, రఫీ, హుస్సేన్, సాదక్ అలీ సాబ్, అస్సాన్, యాసిన్, యాకూబ్, ఇమామ్, జానపాటి నరి తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

❖ *కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్.*

❖ *ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా 18వ వార్డులో శుభ్రత కార్యక్రమం*

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలంతా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన శుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి రహదారులను శుభ్రం చేయించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సక్రమంగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. అలాగే ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి ఇవ్వడం ద్వారా వ్యర్థాల నిర్వహణ సులభమవుతుందని చెప్పారు. ప్రజా



పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాలోత్ కమల చంద్రు నాయక్ మున్సిపల్ వార్డు అధికారి నాగార్జున, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు

❖ *మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలు సీజ్*

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** వాహనాల తనిఖీలు, జరిమానాలు ప్రజల భద్రత కోసం రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా కేంద్రం 60 ఫీట్ల రోడ్డు నందు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ డ్రైవింగ్ లో భాగంగా మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేయడం జరిగిందని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. నిరంతర వాహనాల తనిఖీలు, వాహనాల జరిమానాలు, ఎన్ఫోర్స్మెంట్ నిర్వహణ అనేది ప్రజల భద్రత రోడ్డు ప్రమాదాల నివారణ కోసమేనని ఎస్ఐ సాయిరాం. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు అజాగ్రత్తగా వాహనాలు నడుపుతూ వారు ప్రమాదంలో పడడమే కాక ఎదుటివారిని కూడా ప్రమాదంలో పడేస్తారని తెలిపారు. మైనర్



డ్రైవింగ్ అనేది చట్టాలు నేరమని పిల్లలు వాహనాలు నడుపుతూ దొరికినట్లయితే తల్లిదండ్రులపై వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మైనర్ డ్రైవింగ్ కేసుల్లో చిక్కుకునే పిల్లలకు లైసెన్సులు కూడా రావని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com